క్లుప్తంగా

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవు



మీసేవ కేంద్రంలో విచారణ చేస్తున్న ఆర్‌ఐ

ఇందల్వాయి: మీ సేవ కేంద్రాల్లో ప్రజల నుంచి అధికంగా చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్ అన్నారు. అధిక చార్జీలతో పాటు పట్టాపాస్ బుక్కులు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తానని ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని నల్లవెల్లి మీ సేవ కేంద్రం నిర్వాహకుడు గంగాధర్‌పై వారం రోజుల క్రితం పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆర్‌ఐ బుధవారం విచారణ చేపట్టారు. సమయపాలన పాటించకుండా మీ సేవ కేంద్రంలో ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్న గంగాధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుల వాంగ్మూలంతో పాటు విచారణ అంశాలను తహసీల్దార్‌కు నివేదిక అందించి చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ తెలిపారు.

మహిళా దినోత్సవంపై సదస్సు

నిజామాబాద్ సిటీ: నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు బీఎల్‌పీ నాయకుడు దండి వెంకట్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహుజన లెఫ్ట్ మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మనదేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా జిల్లా సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న కులాచారి దినేశ్

నిజామాబాద్ రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్ అన్నారు. రూరల్ మండలంలో ఆకుల కొండూరులో శివరాత్రిని పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆకుల కొండూర్ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో బుధవారం టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు కులచారి దినేశ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, కొండూరు మధు, కొండూరు మాజీ సర్పంచ్ అశోక్,ముష్కె సంతోష్, శంకర్ రెడ్డి, మహేశ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి టెండర్ల ఆహ్వానం

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ సాయిబాబా ఆలయంలో ఏప్రిల్ 5, 6న శ్రీరామ నవమిని పురస్కరించుకుని టెండర్లను ఆహ్వానిస్తునట్లు ఆలయ ఈవో శ్రీరాం రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయానికి విద్యుద్దీపాలంకరణ, పూల అలంకరణ, ఆలయానికి రంగులు వేయడానికి, టెంట్ హౌస్ సామగ్రి, 20 క్వింటాళ్ల అన్నదానం, వంటలు చేసేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 11 లోపు ఆలయంలో టెండర్లను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా రథోత్సవం



నిజామాబాద్ రూరల్: మండలంలోని అశోక్ ఫారంలో ఉన్న శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ఐదవ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, శాంతిపాఠం, ఆరాధన, మూలమంత్ర హవనం, పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం రథంపై స్వామి వారి విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ బుధవారం తెలిపారు. సదరు యువతిని ఏడాది కాలంగా యువకుడు పెళ్లి చేసుకోవాలని వేధింపులకు గురి చేస్తున్నాడు. ఇటీవల కాలంలో వేధింపులు తీవ్రంకావడంతో యువతి పోలీసులను ఆశ్రయించింది. యువతి ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిది డైవర్షన్ రాజకీయం

- సమస్యలు గాలికొదిలేసి.. కిషన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

సుభాష్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో పూర్తిగా విఫలమైందని, ఎస్ఎల్‌బీసీ ఘటన, శాంతి భద్రతల సమస్య, ప్రజల్లో వ్యతిరేకత, బీజేపీ ఎదుగుదలను ఓర్వలేకనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి కృషి వల్లే మామునూరు ఎయిర్‌పోర్ట్, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణ, సమ్మక్క–సారక్క ట్రైబల్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు కేంద్రం అనుమతిచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణలో ఏ ప్రాజెక్టుకు బీజేపీ అడ్డుపడిందో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన వ్యక్తి బీజేపీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులను చిన్నచూపు చూస్తూ ఓటు బ్యాంకు కోసం మతపరమైన రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. రంజాన్ పురస్కరించుకుని పదోతరగతి ప్రీ ఫైనల్ పరీక్షల టైం టేబుల్ మార్చడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. జమాయితే ఇస్లామిక్ నిషేధిత సంస్థల కార్యక్రమాలకు ప్రభుత్వ ధనం ఖర్చు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. బీజేపీ మాత్రమే తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాగరాజు, మాజీ కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బైపాస్



డివైడర్, విద్యుద్దీపాలు లేని కంఠేశ్వర్ బైపాస్ ప్రాంతం

- డివైడర్లు, విద్యుద్దీపాలు కరువు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా

నిజామాబాద్ రూరల్: నగరంలోని అర్సపల్లి–కంఠేశ్వర్–మాధవనగర్ బైపాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. సుమారు పది కిలోమీటర్ల మేర ఉన్న ఈ దారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఈ ప్రాంతంలో ప్రధాన కూడళ్లు ఎక్కువగా ఉన్నాయి. మాధవనగర్ ఆర్వోబీ నుంచి కంఠేశ్వర్ వెళ్లే వరకు, ఖానాపూర్, కాలూర్ గ్రామాలకు వెళ్లే ఎక్స్ రోడ్డు నుంచి అర్సపల్లి వరకు డివైడర్లు లేవు. విద్యుద్దీపాలు సైతం లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ దారుల గుండా పలువురు ద్విచక్రవాహనదారులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. దీంతో రాత్రి వేళల్లో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. మాధవనగర్ ఆర్వోబీ నుంచి కంఠేశ్వర్ బైపాస్ వరకు రెండు వైపులా సీసీ డ్రైనేజీలు లేవు.

బైపాస్ దారిలో..

కంఠేశ్వర్ బైపాస్ ప్రాంతంలో ఇటీవల ఏడో బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కల్యాణ్‌కుమార్‌ను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో మృతి చెందారు. గతేడాది డిసెంబర్‌లో అర్సపల్లి నుంచి కంఠేశ్వర్ రోడ్డు గుండా ప్రయాణిస్తున్న పలువురు ద్విచక్ర వాహనదారులను ఓ కారు ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇటీవల బైపాస్‌పై బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దారుల గుండా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈని వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ఇబ్బందులు లేకుండా చూడాలి



మాధవనగర్ ఆర్వోబీ పనులు జరిగే చోటు నుంచి కంఠేశ్వర్ వరకు ఇరువైపులా సీసీ డ్రైనేజీ, సెంట్రల్‌లైటింగ్‌ను ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో ఈ ప్రాంతం గుండా ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి. ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలి. – బి లింబాద్రి, నగర వాసి

పైప్‌లైన్లకు మరమ్మతులు



లీకేజీలను పరిశీలిస్తున్న అధికారులు

నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ పరిధిలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను పూడ్చివేసే కార్యక్రమం చేపట్టారు. బుధవారం మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు నగరంలోని 15వ డివిజన్ నిజాం కాలనీ, అంబేద్కర్ కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. వేసవికాలంలో తాగునీటికి సమస్యలు రాకుండా పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ ఈఈ మురళీమోహన్ తెలిపారు. డీఈ ముస్తాక్ అహ్మద్, ఇనాయత్ కరీం, ఏఈ పావని తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

నిజామాబాద్ సిటీ: నిబంధనలు అతిక్రమిస్తూ చేపట్టిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు బుధవారం తొలగించారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ సమీపంలో ఓ వెంచర్ నిర్మించారు. ఇందులో 10 శాతం స్థలం పార్కు కోసం వదిలివేశారు. తాజాగా ఈ స్థలంలో కొందరు ప్లాస్టిక్ షీట్‌లతో నిర్మాణాలు చేపట్టారు. స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రాజ్

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వం బీడీ కార్మికులకు గతంలో ఒప్పందం ప్రకారం వెయ్యి బీడీలకు రూ.10.40పైల చొప్పున కరువు భత్యాన్ని ఇవ్వాలని తెలంగాణ బీడీ కామ్‌గార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్ అన్నారు. బుధవారం నగరంలోని కోటగల్లిలో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు మూలవేతనంపై పెరిగిన వీడీఏతో సహా అన్ని కలిపి రూ.261.97 చెల్లించవల్సి ఉంటుందన్నారు. నెలసరి ఉద్యోగులకు నెలకు మూలవేతనంపై అదనంగా రూ.312 వీడీఏ పెరుగుతుందన్నారు. పెరిగిన కరువు భత్యాన్ని ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీలు జె బాబురావు, మధు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

డిచ్‌పల్లి: బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు, మాధవనగర్ సాయిబాబా ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొత్త సత్యనారాయణ గుప్తా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. సత్యనారాయణ మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన వెంట ధర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, నాయకులు శక్కరికొండ కృష్ణ, దాసరి లక్ష్మీనర్సయ్య, నల్లవెల్లి సాయిలు, ఒడ్డెం నర్సయ్య, నీరడి పద్మారావు, గోపు చిన్నన్న, గుడాల లింగం ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న అమృతాపూర్ గంగాధర్

డిచ్‌పల్లి: ఇటీవల జక్రాన్‌పల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డిచ్‌పల్లి మండలం అమృతాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. ఈనెల 3న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతి చెందిన సిర్నాపల్లి వడ్డెన్న కుటుంబ పేదరికాన్ని గమనించిన ఎమ్మెల్యే చలించిపోయారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బుధవారం ఎమ్మెల్యే అందించిన రూ. 20 వేల నగదును కాంగ్రెస్ నాయకులు వడ్డెన్న భార్య నవనీతకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, నాయకులు మునిపుత్ర నర్సయ్య, గంగాధర్ గౌడ్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయిలో..

ఇందల్వాయి: మండలంలోని లోలం గ్రామంలో ఇటీవల పశువులను మేపుతూ చెరువులో పడి మృతి చెందిన బాదావత్ చిన్న అనే యువకుడి కుటుంబానికి గ్రామస్తులు రూ. 25వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. గ్రామ యువకులు, గ్రామస్తులు డబ్బులు పోగు చేసి బాధిత కుటుంబానికి అందించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



డిచ్‌పల్లి: ధర్మారం(బి) పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



ధర్పల్లిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సాక్షి నెట్‌వర్క్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. డిచ్‌పల్లి మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో 33 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ సందర్శించారు. ధర్పల్లి మండలంలో పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై రామకృష్ణ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద తగు ఏర్పాట్లు చేశారు. ఉన్నతాధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.



కాకతీయ సెంటర్ ఎదుట విద్యార్థులు



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



ఎస్ఎస్ఆర్ కళాశాల ఎదుట..



కాకతీయ సెంటర్ లోపలికి వెళ్తున్న విద్యార్థులు

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ రూరల్: ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అర్బన్‌ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా బుధవారం అన్నారు. రూరల్ మండలంలోని శ్రీనగర్ గ్రామంలో శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భయాన్ని వీడి పరీక్షలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్

జక్రాన్‌పల్లి: పదో తరగతి విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలకు సన్నద్ధం కావాలని పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ చారి సూచించారు. బుధవారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు విజయస్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి వంద ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యార్థులకు పరీక్షలపైన అవగాహన కల్పించారు. పరీక్ష రాసే విధానం గురించి సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, కంచరి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వం చేపట్టే ఎస్సీ వర్గీకరణకు మాలలకు అన్యాయం జరుగుతోందని వెంటనే తమకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా మాలమహానాడు నాయకులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ సమావేశాల్లో మాలలకు న్యాయం జరిగేలా చర్చించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య, నాంది వినయ్, అలుక కిషన్, చొక్కం దేవిదాస్, సక్కి ఉదయ్ కుమార్, తలారి సాయన్న, బట్టి గంగాధర్, నీలం నర్సింగ్‌రావు, ఎ గంగాధర్, రాజన్న, రాంచందర్, శివరాజ్, అమృత్, విజయ్ సోలాంకి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏఎంసీ చైర్మన్ నర్సయ్య బుధవారం భూమిపూజ చేశారు. నాయకులు సుంకెట రవి, నరేందర్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	89,200	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	82,325	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	50	70	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	30	50	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	50	70
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: ఛావా(హిందీ)-11.00.4.40.7.30. 10.20 – అగత్యా(తెలుగు)-1.40
- స్క్రీన్-2: అగత్యా(తెలుగు)-11.00, 4.40 మజాకా(తెలుగు)-1.45, 7.35, 10.30
- స్క్రీన్-3: గార్డ్(తెలుగు)-10.50 రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-1.40, 7.30 శబ్దం(తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: ఛావా(హిందీ)-10.05 మజాకా(తెలుగు)-1.25 టర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-4.30, 7.40, 10.50
- స్క్రీన్-2: మజాకా -10.00,4.15 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.05 ఛావా(హిందీ)-7.20, 10.40
- స్క్రీన్-3: రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-9.40 ఛావా(హిందీ)-12.50 తండేల్(తెలుగు)-4.10, 10.20 మజాకా(తెలుగు)-7.15
- స్క్రీన్ -4: ఓయ్(తెలుగు)-10.05 జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-1.30 ఛావా(హిందీ)-4.20 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40 మజాకా(తెలుగు)-10.40

- లలితామహల్: తండేల్(తెలుగు)
- దేవి: మజాకా(తెలుగు)
- నటరాజ్: ఛావా(హిందీ)
- విజయ్: సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

టేకు దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న టేకు దుంగలతో అటవీ అధికారులు

మోపాల్: మోపాల్ మండలంలోని ఎల్లమ్మకుంటకు చెందిన కెతావత్ మోతీలాల్ వ్యవసాయ బావిలో బుధవారం 60 వరకు టేకు దుంగలను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిజామాబాద్ సౌత్ ఎఫ్ఆర్వో రాధిక ఆధ్వర్యంలో అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. సుమారు రూ.లక్ష విలువైన టేకు దుంగలను స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. విచారణ కొనసాగుతోందని, నిందితులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని ఎఫ్ఆర్వో హెచ్చరించారు. కాగా టేకు దుంగలు ఎవరివో అటవీ అధికారులకు స్పష్టత ఉన్నప్పటికీ.. ఒత్తిళ్ల కారణంగా పేరును బహిర్గతం చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.